క్లుప్తంగా

భద్రాచలానికి ఆంజనేయ మాలధారులు



ఇరుముడులతో భద్రాచలం బయలుదేరిన అభయాంజనేయ స్వామి భక్తులు

మునగపాక: మండలంలోని అరబుపాలెం గ్రామానికి చెందిన పలువురు భక్తులు శనివారం ఇరుముడులతో భద్రాచలం బయలుదేరారు. అభయాంజనేయ స్వామి మాలలు ధరించిన భక్తులు 41 రోజుల దీక్ష పూర్తయిన సందర్భంగా మాలలు విసర్జించేందుకు పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి బస్సుపై బయలుదేరారు. ఇరుముడులు పట్టుకుని ఆంజనేయ స్వామి నామస్మరణ చేసుకుంటూ గ్రామంలో ఊరేగింపు జరిపారు.

పోషకాహారం శ్రేయస్కరం



ఉమ్మలాడలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న సర్పంచ్

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్)కోరారు. మండలంలోని ఉమ్మలాడ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం బాలింతలు, గర్భిణులకు శ్రేయస్కరమన్నారు. ఉప సర్పంచ్ మందా రాము, వైఎస్సార్‌సీపీ నేతలు సూరిశెట్టి రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరం అల్లాయ్స్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులతో రాము

రాంబిల్లి: సెజ్‌లో సుందరం అల్లాయ్స్ కార్మికులు శనివారం ఆందోళనకు దిగారు. వీరికి సీఐటీయూ మద్దతు తెలిపింది. 62 మంది కార్మికులను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, అర్ధాంతరంగా పనులకు రావద్దని చెప్పడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. ఏడేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పనులకు రాకుండా చేయడం అన్యాయమన్నారు. వీరిని విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో వారికి రావాల్సిన ప్రయోజనాలను అందజేయాలని రాము డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని కార్మికులు హెచ్చరించారు.

శ్రీప్రకాష్‌లో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో క్రిస్మస్ పండగ ముందస్తు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తునిలోని ఎస్కాల్ ప్రేయర్ హౌస్‌కు చెందిన ఎస్.జోసెఫ్ సురేష్ హాజరై ఏసు పుట్టుక, క్రిస్మస్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు బుర్రకథ రూపంలో జీసస్ పుట్టుక గురించి తెలిపారు. విద్యార్థులు క్రిస్మస్ పాటలు పాడి నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు దేవదూతలు, శాంతాక్లాజ్ వేషధారణలో పాల్గొని అలరించారు.

ఉత్తమ రైతులకు సన్మానం

రాంబిల్లి: కుమ్మరాపల్లిలో శనివారం రైతు దినోత్సవం సందర్భంగా హరిపురం బీసీటీ కేవీకే సేద్యపు శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు చేతుల మీదుగా ఉత్తమ రైతులు తేటకల సత్యన్నారాయణ, గొల్లవిల్లి శ్రీనివాసరావు, జనపరెడ్డి చిన్నాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ శాస్త్రీయ సలహాలు, సూచనలు పాటిస్తూ ఉత్తమ దిగుబడులు సాధించి, సన్మానం అందుకున్న రైతుల్ని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

- వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఊరూవాడా గోవింద నామస్మరణ



శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి



ఉపమాకలో ధ్వజస్తంభం వద్ద స్వామి దర్శనానికి కిక్కిరిసిన భక్తులు



వెంకన్న స్వామివారికి పూలతో విశేష అలంకరణ



పాటిపల్లిలో సీతారాములను దర్శించుకుంటున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ



ధర్మవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



యలమంచిలి పాత వీధి రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వెంకన్న తొలి అభిషేకంలో పాల్గొన్న భక్తులు



చూచుకొండ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి: పట్టణం, మండలంలోని వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని యలమంచిలి పట్టణంలో ధర్మవరం, వీరాద్రి పర్వతంపై వేంచేసిన శ్రీవేంకటేశ్వరుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ధర్మవరం పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు ఉత్తర ద్వారా దర్శనాలు చేసుకున్నారు. వీరాద్రి పర్వతంపైనున్న వేంకటేశ్వరునికి మెట్ల మార్గం నుంచి మహిళలు పసుపు, కుంకుమలతో బొట్లు పెడుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేశారు. పట్టణంలో పాత వీధి, ధర్మవరం, కొత్తపేట తెరువుపల్లి, మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలు వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. మైహోమ్ ఇండస్ట్రీస్ ఆలయం వద్ద అర్చకులు పరిశ్రమ యాజమాన్యం, కార్మికుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం నుంచి వైష్ణవ ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రాంబిల్లి: మండలంలోని పలు ఆలయాలు శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. దిమిలి వల్లభ నారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. సామూహిక సత్యన్నారాయణ వ్రతాలను నిర్వహించారు. లలిత సహస్ర నామ పారాయణ చేశారు.

కోటవురట్ల: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మండలంలోని భక్తులు శనివారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది. కైలాసపట్నంలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయినగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, కోటవురట్లలోని శ్రీ ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయం, చిన లింగాపురంలోని శ్రీదుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయాలలో భక్తులు పూజలు జరిపారు.

వైకుంఠ ఏకాదశి శోభలో ఉపమాక

నక్కపల్లి: వైకుంఠ(ముక్కోటి) ఏకాదశి సందర్భంగా శనివారం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామి వారిని ముక్తిమార్గం(వైకుంఠ ద్వారం) ద్వారా దర్శించుకుని తరించేందుకు భక్తకోటి తరలివచ్చింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 3 గంటలకు మూలవిరాట్‌కు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు సంకర్షణపల్లి కష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాలతో తొలి అభిషేకం నిర్వహించారు. అర్చన నిత్యపూజాకార్యక్రమాలు బాలభోగ నివేదన, పుణ్యాహవచనం, శాత్తుమురై వంటి కార్యక్రమాల అనంతరం సామాన్య భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. రాష్ట్రంలో తిరుపతి, అన్నవరం, సింహాచలం, భద్రాచలం తదితర వైష్ణవ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి నాడే ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఉపమాకలో మాత్రం నిత్యం ఉత్తర ద్వార దర్శనం దొరుకుతుంది. బేడా మండపంలో ఉంచే స్వామివారి ఉత్సవ మూర్తులను ఈ ఏడాది బేడా మండపం దక్షిణ దిశగా ఉన్న శ్రీవారి పోటు వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి, స్వామివారిని రంగనాథునిగా అలంకరించి ఉత్తర దిక్కున భక్తులకు దర్శనం కల్పించారు. కొండ పైకి వెళ్లలేని వారికి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించిన దేవస్థానం వారిని భక్తులు అభినందించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. స్వామివారిని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, హెటిరో డీజీఎంలు సుబ్బారెడ్డి తదితరులు దర్శించుకున్నారు. విశ్రాంత తెలుగు పండిట్ డాక్టర్ వేదాల గాయత్రీదేవి రాగయుక్తంగా ఆలపించిన తిరుప్పావై ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పాయకరావుపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి, పాండురంగ స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బారులు తీరారు. మంగవరం, పాల్తేరు, రాజగోపాలపురం, రాజుగారిబీడు గ్రామ ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామిని దర్శించుకున్నారు. శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానం నందు గల గరుడ వాహన శోభా యాత్రను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆకట్టుకున్న భజన

రాంబిల్లి: దిమిలి మణికంఠ క్షేత్రంలోని సంతోషి మాత సన్నిధిలో నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా రిటైర్డు హెచ్‌ఎం కోవెల వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశపాత్రునిపాలేనికి చెందిన పోలమాంబ బృందం, దిమిలికి చెందిన గౌరీ పరమేశ్వర భజన బృందం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బృంద సభ్యులను సన్మానించారు. ఉపసర్పంచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చూచుకొండలోని కలియుగ దైవం శ్రీనివాసుని దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మునగపాక పంచాయతీ వీధిలోని రాముల వారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. రామగిరిలో గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. పాటిపల్లిలోని వరాహలక్ష్మీనరసింహ ఆలయ ప్రాంగణంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కొండ తిరుగుడు గ్రామాల మీదుగా ప్రదక్షిణ జరిగింది. దీనిలో భాగంగా డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు తదితరులు ముక్కోటి ఏకాదశి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యలమంచిలి వీరాద్రి పర్వతంపై వేంకటేశ్వరుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రంగనాథునిగా అలంకరించిన స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కైలాసపట్నం రాజగోపాలస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద భక్తుల పూజలు



శ్రీ పాండురంగ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



గరుడవాహనంలో శోభా యాత్ర నిర్వహిస్తున్న భక్తులు

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్ద పీట



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యా కానుక, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 80 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎంఈవో కె.ఎస్.గాంధీ, ఎంపీటీసీలు కొంతం నరేష్, యగదాసు శేఖర్, పోసిన వీరబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షులు వీరే



నాగ అప్పలరాజు (నక్కపల్లి)



సాయి (కోటవురట్ల)



వెంకటరాజు (ఎస్‌రాయవరం)



గోవిందరెడ్డి (పాయకరావుపేట)

నక్కపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుల నియామకాన్ని పార్టీ చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నక్కపల్లి మండల యూత్ అధ్యక్షుడిగా పెద దొడ్డిగల్లుకు చెందిన గొర్ల నాగ అప్పలరాజు, పాయకరావుపేట మండలానికి రాజగోపాలపురానికి చెందిన గుజ్జు గోవిందరెడ్డి, ఎస్‌రాయవరం మండలానికి పోలవరానికి చెందిన నల్లపరాజు వెంకటరాజు, కోటవుటర్ల మండలానికి అన్నంరెడ్డి సాయిలను యూత్ అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అచ్యుతాపురం: వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. యలమంచిలి అర్బన్ పార్టీ యువజన విభాగం అధ్యక్షునిగా పడాల శ్రీను, యలమంచిలి రూరల్‌కు కొలగాని హరీష్, రాంబిల్లి మండలానికి ధూళి వెంకటరావు, అచ్యుతాపురం మండలానికి శరగడం జగ్గారావు, మునగపాక మండల యువజన విభాగం అధ్యక్షుడిగా మొల్లేటి వినోద్ కుమార్‌లను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు

మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు



ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

ఎస్.రాయవరం: వరాహానది గ్రోయిన్లు, కాలువ డోర్లు సకాలంలో ఇరిగేషన్ శాఖ అధికారులు సరిచేసినట్లయితే ముంపు తీవ్రత తక్కువగా ఉండేదని శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. ఇరిగేషన్ ఏఈ చిన్నారావు సమావేశంలో నివేదిక చదివేటపుడు సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. సొంత స్థలంలో ఇళ్లు నిర్మాణం చేసుకున్నవారికి నిధులు ఇవ్వడంలో గృహ నిర్మాణశాఖలో తీవ్ర జాప్యం జరుగుతోందని వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవింద రావు ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రతి పథకానికి నిధుల కేటాయింపు కాస్త అటూఇటుగా జరుగుతున్నా, అధికారులు చొరవ చూపట్లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని పలువురు సభ్యులు ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైస్ ఎంపీపీ కోరారు. సమావేశంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మరో వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, శానాపతి రాము, బైపా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, శానాపతి శ్రీరాములు, దూళి శ్రీనుబాబు, పాలపర్తి పాపారావు, భూపతి అప్పారావు, గాడి అప్పలనరసింహ, ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర



చినదొడ్డిగల్లు నుంచి ఉపమాక వరకు నిర్వహిస్తున్న శోభాయాత్ర

నక్కపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామస్తులు శనివారం నిర్వహించిన శోభాయాత్ర విశేషంగా ఆకట్టుకుంది. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ వెలగా శ్రీనివాస్, వార్డు సభ్యుడు వెలగా సుధాకర్, దావీదు, లక్ష్మణ్ తదితరుల పర్యవేక్షణలో సుమారు వెయ్యిమంది భక్తులు జాతీయ రహదారిమీదుగా ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి శోభాయాత్ర నిర్వహించారు. సుమారు 8 కిలోమీటర్లు దూరం భక్తులు ప్రత్యేక భజన కీర్తనలు ఆలపిస్తూ యాత్రలో పాల్గొన్నారు. యాత్రకు న్యాయంపూడి వద్ద కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ తదితరులు స్వాగతం పలికి, ఉపమాక వరకు నడుస్తూ యాత్రలో పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

యలమంచిలి: రైతులు దేశానికి వెన్నుముకలాంటి వారని పేట బయ్యవరం యూపీ స్కూల్ హెచ్‌ఎం వరలక్ష్మి అన్నారు. జాతీయ రైతు దినోత్సవంలో భాగంగా గ్రామంలో ఉన్న రైతులను పిలిచి విద్యార్థులకు పంటలు పండించే విధానం, వ్యవసాయంలో పురాతన, ఆధునిక పనిముట్లు, యంత్రాల ఉపయోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్ర ఆర్థిక సాయంతో రైతులకు చీరలు, పంచెలు అందించారు.ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, కృష్ణవేణి, శ్రీనుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కనుల పండువగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని వీరన్న కొండపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ వేడుక శనివారం కనుల పండువలా సాగింది. తొలిసారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొండ చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల దూరం చేపట్టిన గిరి ప్రదక్షిణకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మేళ తాళాలు, కోలాటాలు, గోవింద నామ స్మరణతో ఆద్యంతం భక్తి పారవశ్యంతో కొనసాగింది. ఆలయ నిర్వాహకులు గిరి ప్రదక్షిణ జరుగుతున్న మార్గంలో భక్తులకు తాగునీటి ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మేళతాళాలతో వేడుకగా కదులుతున్న భక్తజనం

ఆర్థిక ఆసరా సీఎం జగన్‌తోనే సాధ్యం



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: తమ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఓటెయ్యాలని అడుగుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కోటవురట్ల సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తొలుత సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అంతనరం మా నమ్మకం నువ్వే జగన్ పేరిట పార్టీ జెండాను ఆవిష్కరించారు. లబ్ధిదారులను కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనను, జన్మభూమి కమిటీల ఆగడాలను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. సంక్షేమం అంటేనే గిట్టని వ్యక్తి చంద్రబాబు అని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఓటేయాలని కోరారు. కల్లబొల్లి మాటలు నమ్మి ఓటేస్తే నిలువునా ముంచేస్తారని, గతంలో చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చి ఎలా మోసం చేశాడో వివరించారు. మళ్లీ ఏదేదో చేస్తామని బూటకపు హామీలతో సిద్ధపడుతున్నారని, దుష్టుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ప్రతి కుటుంబం గురించి సీఎం జగన్‌లా ఆలోచించే వ్యక్తి ఎవరూ లేరన్నారు. ఆర్భాటాలు జగన్‌కు నచ్చవని, చేసేది నేరుగా లబ్ధిదారులకు చేరేలా చేయడమే ఆయనకు తెలుసన్నారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాలలో పెనుమార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ, మతం, కులం చూడకుండా ప్రతి ఒక్కరినీ తన కుటుంబంలా భావించి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకుంటే సంక్షేమం, అభివృద్ధి మరింతగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్, సర్పంచ్ అనిల్‌కుమార్, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శెట్టి రమణ, నిమ్మల కృష్ణారావు, జవ్వాది రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవరచుకోవాలి



నూకరాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను అలవరచుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాక లింగరాయి గుడి ప్రాంగణంలో గీతాజయంతిలో భాగంగా గత 41 రోజులుగా గీతాపారాయణం, రామాయణ ప్రవచనం చేసిన డాక్టర్ తేలు నూకరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ గత 50 ఏళ్లుగా ప్రజల్లో భక్తి భావాలు పెంపొందించేందుకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. భగవద్గీతపై పిల్లలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు పాల్గొన్నారు.